

మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి

# రొమ్ము క్యాన్సర్‌పై.. అవగాహన పెంచుదాం

- ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ ప్రారంభోత్సవంలో మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: రొమ్ము క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన కల్పించే బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎంఎస్ఏ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజనల్ క్యాన్సర్ సెంటర్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఫైజర్ స్వచ్ఛంద సహకారంతో స్థానిక బాదేపల్లి కమ్యూనిటీ దవాఖానలో నిర్వహించిన ఉచిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోని ప్రతి 10 మంది మహిళల్లో 6 మంది రొమ్ము కాన్సర్‌తో బాధపడుతున్నారని, చికిత్సలు చేయించుకునే స్తోమత లేక మృత్యువాత పడుతున్నారని అన్నారు. ముందస్తుగా గుర్తించటం వలన చికిత్స సులభం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఎంఎస్‌జే, ఫైజర్ క్యాన్సర్ దవాఖానల వారి సహకారంతో జడ్చర్లలో మొట్టమొదటి సారిగా ప్రభుత్వ వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేయించటం జరిగిందని పేర్కొన్నారు. బాదేపల్లి సీహెచ్‌సీ 16,17 తేదీల్లో, గంగాపూర్ పీహెచ్‌సీలో 19, 20 తేదిల్లో ఉచిత క్యాంప్‌లు నిర్వహించనున్నట్టుగా తెలిపారు. 15 రోజుల్లో జిల్లా దవాఖానలో స్క్రీనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టుగా తెలిపారు. పేదలకు అవసరమైన ఐసీయూ, డయాగ్నోస్టిక్ సెంటర్లను సైతం అన్ని జిల్లా దవాఖానల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉస్మానియా దవాఖానలో నిర్వహించిన అరుదైన సర్జరీ గూర్చి ప్రస్తావిస్తూ, నిరుపేద వ్యక్తికి ట్రాక్యార్డ్, కిడ్నీని ఒకే సర్జరీలో ట్రాన్స్‌ప్లాంట్ చేయటం దేశ చరిత్రలోనే ప్రథమమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎస్‌జే క్యాన్సర్ దవాఖాన డిప్యూటీ డైరెక్టర్ జయలత, డీసీహెచ్ఎస్ డాక్టర్ మీనాక్షి, డీఎంహెచ్‌వో డా.నాగారం, అసిస్టెంట్ డీఎంహెచ్‌వో శ్రీధర్‌రెడ్డి, ఎస్‌పీహెచ్‌వో మల్లికార్జునప్ప, దవాఖాన సూపరింటెండెంట్ డా. నాగరాజుతో పాటు టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాద్మి శివకుమార్, మండల అధ్యక్షుడు కోడ్గల్ యాదయ్య, ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ జయప్రద, వైస్ ఎంపీపీ రాములు, మండల కో ఆప్షన్ సభ్యులు ఇంతియాజ్, వైద్య,ఆరోగ్య సిబ్బంది, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.